సొంతింటి కల తీరేదెన్నడో?

- పిల్లర్లు దాటని పేదల పక్కా ఇళ్ల నిర్మాణం
- ఇల్లెందు పట్టణంతో పాటు మండలంలోనూ అదే పరిస్థితి
- 400 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన.. ఆపై పట్టించుకోని వైనం



పిల్లర్ల దశలోనే ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

ఇల్లెందు: పేదల పక్కా ఇంటి పథకం కలగానే మిగిలిపోనుందా..? అంటే నిజమేనని అనిపిస్తోంది. ఇల్లెందు నియోజకవర్గంలో ఫేజ్–2లో 400 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరయ్యాయి. అయితే, ఇందులో ఏ ఒక్క నిర్మాణం కూడా పూర్తికాలేదు. ఇల్లెందులో పేదలు తమ సొంతింటి కల నెరవేరుతుందని ఆశలు పెట్టుకోగా.. కానీ వారి ఆశలు అడియాసలయ్యేలా మారిపోయింది.

ఇల్లెందు పట్టణంలో 240 గృహాలు

మున్సిపాల్టీలోని 24 వార్డులకు వార్డుకు పది ఇళ్ల చొప్పున 240 ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ముందు ఇళ్లు ఇస్తామని ప్రచారం చేసి ఆశ పెట్టారు. కానీ మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు నిండి నాలుగో ఏడాదిలోకి అడుగుపెట్టింది. ఇక ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన జరిగి కూడా రెండేళ్లు గడిచింది. అయినా, ఇల్లెందులో పేదలకు పక్కా ఇంటి పథకం కలగానే మిగిలిపోనుంది. పట్టణంలోని హరిహర క్షేత్రం వద్ద పది బ్లాకుల్లో 240 ఇండ్లకు ఎమ్మెల్యే హరిప్రియ శంకుస్థాపన చేయగా.. ఇసుక, సిమెంట్, నీటి సమస్యతో పునాదుల వరకు పనులు జరిగాక నిలిచిపోయింది.

మండలానికి జరగని స్థల గుర్తింపు

మున్సిపాలిటీ విషయాన్ని పక్కన పెడితే ఇల్లెందు మండలానికి సైతం 60 ఇండ్లు కేటాయించారు. బొజ్జాయిగూడెం, ఇందిరానగర్, మాణిక్యారంలో ఇరవై చొప్పున ఇళ్లు నిర్మించాలనే లక్ష్యం. కానీ ఈ మూడు గ్రామాల్లో కూడా స్థలాన్ని సైతం గుర్తించలేదు. ఎక్కడా ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడమే కారణమని చెబుతుండగా.. ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించడం లేదు.

తొలి దశకే పరిమితమా?

తొలి విడతలో ఇల్లెందుకు మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇండ్లు ముచ్చటగా మూడు చోట్ల నిర్మాణం చేశారు. ఒక చోట స్థలం లేక వదిలేశారు. ఇల్లెందుకు 80 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు కాగా సుదిమళ్ల పంచాయతీకి లలితాపురంలో 20 ఇండ్లు, రాఘబోయినగూడెం పంచాయతీ ముల్కనూరులో 20 ఇండ్లు, చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడలో 20 ఇండ్లు నిర్మించారు. వేములవాడ, లలితాపురంలో స్థలం కొనుగోలు చేసి నిర్మించారు. రొంపేడు గ్రామపంచాయతీ 21 ఫిట్‌లో 20 ఇండ్లు చేపట్టేందుకు స్థలం లేక రద్దు చేశారు. ఇవన్నీ పక్కన పెడితే రెండో దశ మాత్రం అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతుండటంతో నిరుపేదల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాసీనత

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇంటి పథకంపై కాస్త హడావుడి కనిపించేది. ఇటు పంచాయతీ నుంచి జిల్లాస్థాయి వరకు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ ఉండేది. కానీ, ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో అటు ప్రజా ప్రతినిధులు.. ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఎవరికి వారు యమునా తీరే అన్న చందంగా వదిలేశారు.

అద్దె కట్టలేక అవస్థ పడుతున్నాం..



ఇల్లెందులో ఎంతో మంది పేదలు సొంత ఇల్లు లేక, అద్దె ఇళ్లలో ఉంటున్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటి వరకు 100 ఇండ్లు కూడా పేదలకు కట్టించి ఇవ్వలేదు. రెండేళ్ల కిందట చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను ఇకనైనా పూర్తిచేయాలి. తద్వారా పేదలకు సొంతింటి కలను నిజం చేసి ఆదుకోవాలి.

–తాళ్లూరి కృష్ణ, ఇల్లెందు

పేదలకు న్యాయం చేయాలి



పట్టణంలోనూ, మండలంలోనూ ఇళ్లు లేని పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి న్యాయం చేయాలి. పేదోళ్ల సొంత ఇంటి కల తీరకపోగా కిరాయి ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే నిర్మాణం మొదలైన ఇళ్లనైనా పూర్తిచేసి అర్హులకు కేటాయిస్తే న్యాయం జరుగుతుంది.

–వేముల వెంకట్, సుభాష్‌నగర్, ఇల్లెందు

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సుజాతనగర్: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ, తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని సింగభూపాలెం గ్రామంలో స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ రాష్ట్రంలో పేదల పక్షాన పోరాడుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణతోపాటు భూక్య రాజేశ్, ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, గుగులోత్ రమేశ్‌బాబు, కోనేరు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు, ఎస్కే ఖాసీం, వెంకటేశ్, మారుతి వెంకన్న, నరేశ్, ప్రవీణ్, శ్రీను, బాలు, వినోద్, నానక కిరణ్, ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజారావుపేటలో కంటి వైద్యశిబిరం

జూలూరుపాడు: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని భోజ్యాతండా జీపీ రాజారావుపేటలో కంటి వైద్యశిబిరం సోమవారం ఏర్పాటు చేయగా ఎంపీపీ సోనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు తేజస్విని, సర్పంచ్ కిషన్‌లాల్, వైద్య సిబ్బంది రాధిక, వెంకటముత్యం, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ ఫిరాయింపుల కేసు సీబీఐకి అప్పగించాలి

టేకులపల్లి: ఎమ్మెల్యేల కొనుగోలు కేసుని హైకోర్టు సీబీఐకి అప్పగించిందని ఇదే తరహాలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచి స్వార్థంతో బీఆర్‌ఎస్‌లో చేరిన 12 మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసును సీబీఐకి అప్పగించాలని టీపీసీసీ కార్యదర్శి భూక్య మంగీలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, పాలేరు, సత్తుపల్లి తదితర 12 మంది ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోలేని స్పీకర్ ఉండటం శోచనీయమని పేర్కొన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భూక్య దేవానాయక్, ఆకారపు స్వప్న, రాసమల్ల నర్సయ్య, బాణోతు సరిలాల్, వీసం శ్రీనివాస్‌రావు, లవ్‌కుమార్, బాడిశ సమ్మయ్య, ఈసం ప్రసాద్, ప్రకాశం, భద్రు, అర్జున్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జూలూరుపాడు: పోడు భూములకు పట్టాలివ్వాలని, కొమరం భీమ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ కొమరం భీమ్ ఫౌండేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు, కొమరం భీమ్ ఫౌండేషన్ నాయకులు మాట్లాడారు. పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసులకు ఎలాంటి షరతులు లేకుండా పట్టాలివ్వాలన్నారు. అనంతరం ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బచ్చల లక్ష్మయ్య, తెల్లం మహేశ్, బచ్చల రాంబాబు, మల్కం వీరభద్రం, ఈసాల ఎర్రయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ రాజీనామా చేయాలి..

ఇల్లెందు: మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని అసమ్మతి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం క్యాంపు నుంచి విడుదల చేసిన ప్రకటనలో చైర్మన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని ప్రకటించారు. తనకున్న పలుకుబడి, అర్థబలం, అంగబలంతో పదవిని కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అసమ్మతి కౌన్సిలర్ల మీద ఎలాంటి చర్యలు తీసుకున్నా మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

ఐదో రోజుకు చేరిన గుడిసెవాసుల దీక్షలు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్‌తండాలో మూడేళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ ఆరోపించారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గుడిసెవాసులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, ధరావత్ రాందాస్, వైకుంఠం, సరిత, వెంకన్న, వీరస్వామి, వీరభద్రం, పాషా పాల్గొన్నారు.

దాడిచేసినవారిపై చర్యలు తీసుకోవాలి..

సుజాతనగర్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గరీభ్‌పేట ఎంపీటీసీ కస్నబోయిన భద్రం డిమాండ్ చేశారు. సుజాతనగర్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత నెలలో నరసింహసాగర్‌లో సుమారు 200 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయని తెలిపారు. అది చూసి ఓర్వలేక కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఫ్లెక్సీలు చించుతుండగా అడ్డుకున్న పార్టీ కార్యకర్తపై దాడులకు పాల్పడటం తగదన్నారు. అనంతరం దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గని భద్రతపై అవగాహన

ఇల్లెందు: వేసవి కాలంలో క్వారీలో హెవీ ఎర్త్ మూవింగ్ మెషనరీ, ఎలక్ట్రికల్ విభాగాలలో మంటలు సంభవించే అవకాశం ఉన్నందున వాటిని అరికట్టడానికి ప్రతీ ఒక్క ఉద్యోగి ఫైర్ ఫైటింగ్ పరికరాలపై అవగాహన కలిగి ఉండాలని జేకే–5 ఓసీ మేనేజర్ పి.పూర్ణచందర్‌రావు తెలిపారు. సోమవారం జేకేఓసీ–5 ఓసీలో గనులు, డిపార్ట్‌మెంట్లలో 'ఫైర్ ఫైటింగ్ పరికరాల వ్యవస్థ'అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించొద్దని కోరారు. చిన్నయ్య, వెంకటేశ్వర్లు, శ్రీహరి, సంజీవరావు పాల్గొన్నారు.

పోరాట రూపాలు మారుస్తాం..



దీక్షలో కూర్చున్న కొమరారం గ్రామస్తులు

ఇల్లెందురూరల్: కొమరారం కేంద్రంగా నూతన మండలాన్ని ప్రకటించాలనే డిమాండ్‌తో ప్రజాపంథా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కొమరారం మండల సాధన ఉద్యమ నాయకుడు, ఎంపీటీసీ అజ్మీర బిచ్చా మాట్లాడుతూ.. పాలకులు ప్రజల ఆకాంక్షను పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల సమయంలో ప్రస్తుత గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాళి కృష్ణవేణి, నాయకులు ఎలుగు శాంతారావు, మల్లిపెద్ది జాన్‌బాబు, బుర్ర రాఘవులు, ఆలవాల కోటేశ్వరరావు, అజ్మీర రాంజీ, లక్ష్మినారాయణ, కిషన్, మోహనాచారి, మోతిరాం, వాంకుడోత్ శంకర్, రాంసింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): అటవీ సంరక్షణ నియమాలు–2022 చట్టాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముద్దా భిక్షం మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బోనస్‌లు వెంటనే చెల్లించాలని, కార్మికులకు కల్లాల వద్దనే కూలీ చెల్లించాలని, ఆకు సేకరణ సమయంలో ప్రమాదవశాత్తు గాయపడితే రూ.5 లక్షలు, మృతిచెందితే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతోట్ కృష్ణ, బుర్రా వెంకన్న, బానోత్ ధర్మా, నకిరేకంటి నాగేశ్వరరావు, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, సుందర్, ఎస్.వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, వి.పద్మ, పి.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న 'శ్రీచైతన్య' సిబ్బంది

పాల్వంచ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో గత 12వ తేదీన నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులు కౌశిక్, యాసర్, అవంతిక బంగారు, షాజహాన్, హరికృష్ణ వెండి పతకాలను సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.రాణి, కరాటే మాస్టర్ పవన్‌రెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జ్ షమ్స్ ఇరమ్ అభినందించారు. నెహ్రూనగర్ శ్రీనారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సైతం పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణం, డీన్ డి.చంటి, ఏఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్పీతో ఆదివాసీ సంఘాల భేటీ



ఎస్పీ వినీత్‌ను కలిసిన ఆదివాసీ నాయకులు

పాల్వంచ: ఏజెన్సీ ప్రాంతంలో తప్పుడు పత్రాలు చూపించి, అక్రమ కేసులు పెట్టిన వారిపైనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ వినీత్‌ను కలిసి సమస్యను వివరించారు. ములకలపల్లి మండలం సీతారాంపురం పంచాయతీ, సోయంగంగులగూడెం ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 241లో కొంత భూమిలో పూర్వం నుంచి ఆదివాసీలు జీవిస్తున్నారన్నారు. కొందరు గిరిజనేతరులు తప్పుడు పత్రాలు చూపిస్తున్నారని, రెవెన్యూ అధికారుల సర్వేలో వాస్తవాలు పరిశీలించాలని, తమపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఊకే ముక్తేశ్వరరావు, బాడిశ భిక్షందొర, సోయం బాబూరావు, ఆరెం ప్రశాంత్, సోయం కృష్ణకుమార్, పద్దం నాగరాజు, కొండ్రు శ్రీరాములు, ఊకె బుల్లిబాబు, కొండ్రు పద్మ, పెద్దమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

టేకులపల్లి: మండలంలోని కుంటల్ల గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, సర్పంచ్ మోకాళ్ల రమాదేవి, ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, ఈది గణేశ్, మోకాళ్ల పోశాలు, బోడ మంగీలాల్, బాణోతు రవి, భూక్య సర్దార్, రావూరి సతీశ్, పూనెం సురేందర్ పాల్గొన్నారు.

పెన్షన్ సమస్యలు పరిష్కారం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా మాజీ ఉద్యోగుల పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కారమయ్యాయి. సోమవారం ఏరియా జీఎం షాలేము రాజు ఆధ్వర్యంలో ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో సీఎంపీఎఫ్ అధికారి కనకమ్మ హాజరై పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా రక్షణ అధికారి శ్రీనివాస్, అధికారులు జీవీ మోహన్‌రావు, వెంకటరామచంద్ర, ఆదినారాయణ, శ్రీహరి, కృష్ణ, సాయి స్వరూప్, చిరంజీవి, సీతారాములు, సులోచన, రంగనాథ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్‌ఐ రమణారెడ్డి

టేకులపల్లి: టేకులపల్లి ఎస్‌ఐగా గన్‌రెడ్డి రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ ఏలేటి ఇంద్రసేనారెడ్డి సమక్షంలో ఎస్‌ఐ భూక్య శ్రీనివాస్ నుంచి చార్జ్ తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ భూక్య శ్రీనివాస్ బూర్గంపాడుకు బదిలీ కావడంతో కొమరారం ఎస్‌ఐగా, బూర్గంపాడు అటాచ్‌గా చేస్తున్న రమణారెడ్డిని టేకులపల్లికి బదిలీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ఇల్లెందురూరల్: తన వార్డులో సమస్యలు పరిష్కరించాలంటూ మండలంలోని మొండితోగు గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యురాలు జమీలా బేగం సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు సభ్యురాలిగా గెలిచి నాలుగేళ్లు పూర్తయిందే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయామని వాపోయారు. వార్డు పరిధిలో గతంలో 15 ఫీట్ల రోడ్డు ఉండేదని, ఆ దారిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని చెప్పారు. ఇదేవిషయమై గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్, సర్పంచ్, మండల పరిషత్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు, బీఆర్‌ఎస్ పెద్దలకు కూడా తెలిపామని, అయినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తానని స్పష్టం చేశారు.

ఉపకులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు..



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్



మాట్లాడుతున్న ఉపేందర్

జూలూరుపాడు: 11 ఉప కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానం చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేశ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం జూలూరుపాడులో ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశాన్ని నిర్వహించగా రాజేష్‌నాయక్ మాట్లాడారు. 2016లో షెడ్యూల్డ్ తెగల విచారణ కమిటీ ఆదేశించిన 10 తెగలు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాలలో నివసిస్తున్న మాలి తెగను ఎస్టీ జాబితాలో చేర్చడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని, ఏదైనా ఒక కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలంటే ప్రత్యేక కమిషన్‌ను నియమించి, సర్వే చేపట్టి ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన తరువాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని, కానీ, ఎలాంటి సర్వేలు, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే ఉప కులాలను ఎస్టీ జాబితాలో ఎలా చేర్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పాయం సత్యనారాయణ, వాసం రామకృష్ణదొర, కృష్ణానాయక్, గుగులోత్ మోహన్‌నాయక్, గుగులోత్ కేశవ్‌నాయక్, ధరంసోత్ దశరథ్‌నాయక్, కొమరం బుచ్చయ్య, జగ్గా పుల్లయ్య, వాసం అంజిబాబు, సర్పా సురేశ్, పొడుగు శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆ కులాలను కలపొద్దు..

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల్లో 11 కులాలను కలుపాలనుకోవడం దారుణమని, తక్షణమే ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలని ఆదివాసీ విద్యార్థి పరిషత్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు సనప గోవర్ధన్, చింతా ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో జరిగిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కులాలను ఎస్టీ జాబితాలో కలపాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటి వరకు ఆదివాసీ చట్టాలను అమలు చేయని ఈ ప్రభుత్వాలు.. ఓట్ల కోసం ఆదివాసుల్లో మనుగడ లేకుండా చేయాలని కుట్రతోనే 11 కులాలను ఎస్టీలో కలపాలని నిర్ణయించారని ఆరోపించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నాయకులు ఊకే చైతన్య, బచ్చల భాస్కర్, రాకేశ్, ఈసం సుధీర్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ వృత్తిని రక్షించాల్సింది ప్రభుత్వమే..



క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కొత్తగూడెంఅర్బన్: నాయీ బ్రాహ్మణ వృత్తిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తూముల సదానందం పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తూముల శ్రీనివాస్, కురుమిళ్ల శంకర్, యలమందల కృష్ణప్రసాద్, లింగంపల్లి దయానంద్, జంపాల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారు..

- అదానీపై చర్యలు తీసుకోవాల్సిందే..
- సీపీఐ ఆధ్వర్యంలో బ్యాంకులు, ఎల్‌ఐసీ కార్యాలయాల వద్ద ఆందోళన

కేంద్ర ప్రభుత్వ సాయంతో భారత దేశ ఆర్థిక వ్యవస్థనే తీవ్రంగా దెబ్బతీస్తున్న అదానీ ఆస్తులను వెంటనే జప్తు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకులు, ఎల్‌ఐసీ కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. ఎల్‌ఐసీలో షేర్ల రూపంలో సుమారు రూ.25 వేల కోట్లను, ఎస్‌బీఐలో రూ.54 వేల కోట్లను.. ఖాతాదారుల నుంచి అప్పనంగా లాగేస్తున్నారని ఆరోపించారు. ఇందులో ప్రధాని నరేంద్రమోదీ హస్తం ఉందని, వెంటనే అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



టేకులపల్లి: ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



పాల్వంచ: ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు



ఇల్లెందు: ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం